# గోడ మీద బొమ్మ

నేను ఏనాడో ఒక మేగజైన్‌లో చూసిన బాపుగారి కార్టూన్ నాకింకా బాగా గుర్తుంది. అది ఒక ఆర్ట్ గ్యాలరీ. అక్కడ గోడ మీద ఒక చక్కటి పైంటింగ్. ఎటు చూసినా ఒకేలావున్న పెద్ద సున్నా. దాని మధ్యలో ఒక చుక్క. అది చూసి ఆ ఆర్టిస్టు 'ఎవడ్రా పైంటింగ్‌ని తల్లకిందులుగా తగిలించింది' అని అరుస్తుంటాడు. మోడరన్ ఆర్ట్ మీద చక్కని హాస్యం.

0 0 0

ఆరోజు రిక్రియేషన్ సెంటర్లో వైట్ మెషీన్ల మీద ఎక్సర్‌సైజ్ పూర్తిచేసుకుని, కార్డియో వాస్క్యులర్ మెషీన్లు ఏవీ ఖాళీ లేకపోవటంతో మేడమీదకి వెళ్ళాను. అక్కడ నలుచదరంగా వున్న పొడుగాటి బాల్కనీలో నడవటానికి మంచి ట్రాక్ వుంది. దాని చుట్టూతా పది రౌండ్లు కొడితే మైలు దూరం అవుతుంది. కనీసం మూడు మైళ్ళన్నా చకచకా నడవాలనే ఉద్దేశ్యంతో పైకి వెళ్ళాను. మొదట్లోనే ఒక చిన్న బోర్డు వుంది. స్కూలు పిల్లల ఆర్ట్ ఎగ్జిబిషన్ అని. పిల్లలు వేసిన చిత్రాలని చిన్న చూపేంలేదు కానీ, నా నడక కార్యక్రమం మీద దృష్టి పెట్టి, అవేమీ పట్టించుకోకుండా కాళ్ళకి పని చెప్పాను. ఒక్కొక్క రౌండ్ ఒక నిముషంబావులో చేయగలిగితే బావుంటుందని గబగబా నడుస్తున్నాను. నడుస్తున్నప్పుడు అప్పుడప్పుడూ గోడ మీద బొమ్మలు చూస్తుంటే, ఆ బొమ్మల క్రింద అవి గీసిన వారి పేరూ, తరగతీ వ్రాసి వున్నాయి. పోతూ పోతూ మధ్యమధ్యలో అవి చూస్తూ నడుస్తున్నాను.

నా వెనకనించీ చకచకా నడుస్తూ నన్ను దాటిపోతున్న అమ్మాయి నాతో 'చాల బాగున్నాయి కదూ. పిల్లలు వేశారంటే నమ్మబుద్ధి వేయటంలేదు' అంది. అంటూనే గోడ మీద బొమ్మల్ని చూస్తూ నన్ను దాటి వెళ్ళిపోయింది. నిజం చెప్పొద్దూ ఆ అమ్మాయి ఆ మాట అన్నాక, నేనూ కొంచెం శ్రద్ధగా బొమ్మల్ని చూస్తూ నడవటం మొదలుపెట్టాను. అవి నాకు ఎంత బాగా నచ్చాయంటే నా నడక ఆపేసి అవే నెమ్మదిగా చూస్తూ తరువాత రెండు గంటలు గడిపాను.

0 0 0

నేను ఎన్నో చోట్ల, పారిస్‌లో ప్రపంచ ప్రఖ్యాత లూవ్‌తో సహా, ఎన్నో ఆర్ట్

గాలరీస్ ఆర్ట్ మ్యూజియంలూ చూశాను కానీ, నాకు బాగా ఇష్టమైనది తిరువనంత పురంలోని ఆర్ట్ గ్యాలరీ. ఇంతకు ముందు మన దేశపు మహారాజుల్లో తొంభై శాతం తరాజులే కానీ, కొద్దిమంది కళా పోషణ చేసి భారతదేశ చరిత్రలో కలకాలం అలా నిలిచిపోయారు. వాళ్ళల్లో మనకి బాగా గుర్తున్నది శ్రీకృష్ణదేవరాయలు. ఆయన అష్ట దిగ్గజాలతో సాహిత్య సేవ చేస్తే, కేరళలో మహారాజుల కుటుంబం స్వాతి తిరునాళ్, కార్తిక తిరునాళ్ సంగీత సాహిత్యాలలో, రామవర్మ రవివర్మలు చిత్రకళలో ఎంతో పేరు సంపాదించారు. తిరువనంతపురం ఆర్ట్ గాలరీకి ఎన్నిసార్లు వెళ్ళినా, మళ్ళీ వెళ్ళ బుద్ధివేసేది. అక్కడ రవివర్మ, రామవర్మల చిత్రాలకోసం ఒక విభాగమే కేటాయిం చారు. రవివర్మ చిత్రాలలో ఎంతో గొప్పది 'విసినికర్రతో ఆమె' (లేడీ విత్ ది ఫాన్). ఇంకొక విభాగంలో ఎంతోమంది చిత్రకారుల ప్రపంచ ప్రఖ్యాత చిత్రాలున్నాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి చదివి ప్రభావితుడయిన నాకు, ఆయన గొప్ప చిత్రకారుడని నాకు అక్కడే తెలిసింది. చాలమంది యువకులూ యువతులూ ఎక్కడె క్కడినించో వచ్చి, అక్కడే నేల మీద కూర్చుని ఆ బొమ్మలను చూసి బొమ్మలు గీస్తుండేవాళ్ళు. అప్పుడే అనుకుంటుండేవాణ్ని, మన పిల్లలకి కనీసం కొంతమందికైనా స్కూళ్ళల్లో చిత్రకళ నేర్పించి, ఇలాటి చిత్రకళా నిలయాలకి తీసుకువచ్చి, అవసరమైన మెలుకువలు చూపించి ప్రోత్సాహం ఇస్తే తరువాత తరంలో ఎంతమంది చక్కటి చిత్రకారులు వస్తారో అనిపించేది.

0 0 0

మళ్ళీ మా రిక్రియేషన్ సెంటర్లో గోడ మీద బొమ్మలు చూద్దాం. ఈ బొమ్మలు వేసినవాళ్ళు అందరూ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు. అంటే అయిదా రేళ్ళ వయసునించీ పది పదకొండేళ్ళ వయసుదాకా వున్న పిల్లలు. ఆ బొమ్మల్లో కొన్ని, అనుమానం లేకుండా, వాళ్ళ వయసుకి మించి వున్నాయి. ఆ గోడల మీద కొన్ని భాగాలుగా విభజించి, ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క స్కూలు పిల్లలు వేసిన చిత్రాలు వుంచారు. మధ్యలో స్కూల్ పేరు, ఆర్ట్ టీచర్ పేరూ వ్రాశారు. వాటిల్లో కొన్ని వాటర్ కలర్స్‌తో వేసినవి, కొన్ని అద్దకం చేసినవి, కొన్ని చాక్ పాస్టెల్స్ జిగురులతో వేసినవి, కొన్ని పెన్సిల్‌తో వేసినవి, కొన్ని పేపర్‌ని ముక్కలుగా చేసి మడిచి రకరకాల రంగులతో రంగరించి అతికించినవీ... ఇలా ఎన్నో భిన్నరకాలుగా చేసినవి వున్నాయి. వాటిలో నాకు నచ్చినవి చాల వున్నాయి.

ఈ చిత్రాలని చూస్తుంటే నాకేమనిపించిందంటే, పిల్లలలోని చిత్రకళని ఐదు రకలుగా వారి టీచర్లు బయటికి తీసుకు వచ్చారని. ఒకటి - ప్రముఖుల పైంటింగ్స్‌ని కొన్ని ఇచ్చి అవి చూసి వేయమని. రెండు - కొన్ని ఫొటోలని ఇచ్చి అవి చూసి పైంటింగులలా వేయమని. మూడు - పూల గుత్తులు, కూరలు మొదలైనవి ఏమైనా సరే రంగుల కాగితాల మీద పెట్టి అవి చూసి వేయమని. నాలుగు - కత్తిరించిన కాగితాలు, ఈకలు, జిగురు, ప్లేడో (తెలుగులో ప్లాస్టిక్ చలిమిడి అందామా)లాటి వాటితో రకరకాల పద్ధతుల్లో కళా విశేషాలని తయారు చేయటం, ఐదు: ఏమీ చెప్పకుండా అంతా వారి ఊహలకి వదిలివేయటం. కాకపోతే ఏ ప్రక్రియ

వాడినా, చిన్నచిన్న పిల్లలు వారి ఊహలకి ఆకాశమే హద్దుగా, ఎన్నో చక్కటి చిత్రాలని తయారు చేయటం. కళాంశ అనేది ప్రతివారిలో వుంటుంది. దాన్ని స్ఫూర్తితో పైకి తీసుకురావటం ముఖ్యం. అదే చేస్తున్నారిక్కడ అని అర్థమైపోతున్నది ఇవి చూస్తుంటే.

పికాసో చిత్రం 'పూలగుత్తితో చేయి' ఆధారంతో చాలమంది బొమ్మలు వేశారు. కొంతమంది ఒక చేయి వేస్తే, కొంతమంది రెండు చేతులు వేశారు. రకరకాల పూలు. రంగురంగుల చేమంతులు, తులిప్‌లు, లిల్లీలు, గులాబులు. వాటి మధ్య ఆకుపచ్చటి ఆకులు. ఒక చిత్రానికి ఆ పిల్ల పెట్టిన పేరు 'రెండు చేతులూ మూడు పువ్వులూ'. కొన్ని పిల్లలు వేసినట్టుగా వుంటే, కొన్ని పిల్లలే వేశారా అనేట్టుగా వున్నాయి.

అలాగే బాటిక్ పైంట్ చేసిన 'ఓవర్ లాప్పింగ్ హాండ్స్' అనేది కూడా చాల బాగుంది. రకరకాల రంగులతో వేసిన మచ్చులు లేదా బాణీలు (ఆంగ్లంలో పేటర్న్‌లు) చాల చక్కగా వున్నాయి. ప్రతి మతంలోనూ సున్నాకి చాల ప్రాముఖ్యం వుంది. దాని గురించి ఇంకోసారి చెప్పుకుందాం. ఈ సారి చిత్రకళా సందర్భంగా చూద్దాం. సున్నాలో నీడలు ఎంతో బాగుంది. అలాగే రకరకాల అనురూప కల్పనలు. (ఓ తెలుగువాడా.... అనురూప కల్పనలు అంటే ఇంగ్లీషులో సిమ్మెటిక్ డెజైన్లు అని నా తాపత్రయం)

తీసిన ఫొటోల మీదా వాటితోనూ రకరకాల పెన్సిల్ గీతలతో స్వీయ రూప చిత్రణలు కూడా చెప్పుకోదగ్గవి. యాండీ వార్‌హోల్ గీసిన పాప్ ఆర్ట్, ఎరిక్ కార్‌లె చిత్రాలు, జిం డిన్ వేసిన హృదయం అనే చిత్రాల ఆధారంగా కూడా వున్నాయి. మొత్తానికి ఈ అన్ని చిత్రాలూ, ఇవాల్టి కళాకారుల కళాఖండాలు కాకపోయినా అవి రేపటి చిత్రకారుల మల్లె మొగ్గలు. భవిష్యత్తులో విచ్చుకోవటమే కాక, సుగంధాలను కూడా వెదజల్లబోతున్నాయి.

0 0 0

బాపూగారిదే ఇంకొక కార్టూన్ గుర్తుకి వస్తున్నది. సందర్భం కాకపోయినా ఎందుకు చెబుతున్నానంటే, నాకు బాగా ఇష్టమైనది కనుక. ఇంకా బాగా గుర్తున్నది కనుక.

ఒక ఆర్ట్ గ్యాలరీలో ఇద్దరు కుర్రాళ్ళు బొమ్మలన్నీ చూసుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నారు. అక్కడ గోడ మీద ఒక చక్కటి చిత్రం. రకరకాల రంగులతో వేసిన ఆధునిక రేఖా చిత్రం. మోడరన్ ఆర్ట్. అది చూస్తుండగా, ఎదురుగా వస్తున్న ఒక సెక్యూరిటీ అతను కనపడ్డాడు వాళ్ళకి. దాంతో ఒక కుర్రాడికి భయం పట్టుకుంది.

'ఒరేయ్! ఈ పిచ్చి గీతలు మనమే గీశారనుకుంటారేమో వీళ్ళు. పద పోదాం... ' అంటాడు.

0 0 0